సాక్షి
మహబూబాబాద్
శుక్రవారం । 17 । జనవరి । 2025



సకల కళా కోవిదులు ..
వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ అంధుల పాఠశాల విద్యార్థులు ఆటలు, పాటలు, మిమిక్రీలో రాణిస్తున్నారు. సకల కళాకోవిదులపై 'సాక్షి' ప్రత్యేక కథనం. - 8లో▸



మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ
హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి పండుగ ఉత్సవాలు ముగిశాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.5^0/18.3^0

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు పడుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

తొర్రూరు అభివృద్ధికి సహకరించాలి



తొర్రూరు: తొర్రూరు పట్టణ అభివృద్ధికి స్థానికులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం పాలకవర్గ తుది సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 56 అంశాలపై చర్చ జరగగా పలు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ.. తొర్రూరు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారం అందిస్తారన్నారు. పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ శాంతికుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, ఏఈ రంజిత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన ఊట్ల గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా జీపీ ఏర్పడినప్పటికీ ఇప్పటి వరకు భవనం లేదని, స్థలం లేక నిర్మించలేదని గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామంలో ముందుగా గ్రామ పంచాయతీ భవనానికి ఎక్కడో ఓ చోట స్థలం చూసి నిర్మించే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. జీపీ పరిధిలో ఉండాల్సిన పలు ప్రభుత్వ శాఖల పనితీరును పరిశీలించాలని, వాటి ద్వారా లబ్ధి చేకూర్చుకోవాలన్నారు. వెంకన్న, మోతీలాల్‌నాయక్, రాంబాబు, రాజు ఉన్నారు.

సర్వేను పరిశీలించిన ఆర్డీఓ

డోర్నకల్: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేను గురువారం మహబూబాబాద్ ఆర్డీఓ కె.కృష్ణవేణి పరిశీలించారు. అమ్మపాలెం, గొల్లచర్ల గ్రామాల పరిధిలో సాగుకు యోగ్యంకాని భూములను ఆర్డీఓ పరిశీలించారు. గ్రామాల్లో రేషన్ కార్డుల లబ్ధిదారుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, ఆర్‌ఐ వీరన్న, డీటీ యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాలకు ఏర్పాట్లు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని పోలీసు క్రీడామైదానంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జిల్లా పోలీస్‌శాఖ క్రీడోత్సవాల (పోలీస్ డ్యూటీ మీట్) నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీసు కార్యాలయ భవన ప్రాంగణంలో నిర్వహించనున్న క్రీడోత్సవాల ఏర్పాట్లను గురువారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్భుతమైన క్రీడామైదానాన్ని సిద్ధం చేశామని, క్రీడోత్సవాల కోసం ప్రత్యేకంగా క్రికెట్ పిచ్, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. పరుగుపందెం నిర్వహణకు ప్రత్యేకంగా ట్రాక్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, జావెలిన్ త్రో వంటి అనేక క్రీడల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి పోడు భూముల హక్కు పత్రాలు కలిగిన అర్హులైన గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనశాఖ అధికారి ఉపసంచాలకులు గుగులోత్ దేశీరాం గురువారం తెలిపారు. ప్రతీ సబ్‌స్టేషన్ ఉప విద్యుత్ కేంద్రం నుంచి 5కిలో మీటర్ల పరిధిలోని గిరిజన రైతులకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 19 తేదీ వరకు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గిరిజన శాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8466937681, 8522951703 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉపకార వేతనాల కోసం..

నెహ్రూసెంటర్: జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన కార్మికుల పిల్లలు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్మికశాఖ అధికారి రమేశ్ గురువారం తెలిపారు. దరఖాస్తు ఫారం సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 15వ తేదీలోగా కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. పదో తరగతి, ఐటీఐ కోర్సుల వారికి రూ.1000, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజనీరింగ్, మెడిసిన్, బీఎస్సీ (అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్) బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ లాబోరేటరీ, టెక్నికల్ కోర్సు పూర్తి చేసిన వారికి రూ. 2000 చొప్పున ఉపకార వేతనాలు చెల్లిస్తారన్నారు. మార్కుల ఆధారంగా ఎంపిక చేసి, ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారన్నారు.

లెక్క తప్పొద్దు..

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- మూడేళ్లుగా గణితం, సైన్స్‌లో అత్యధికంగా విద్యార్థులు ఫెయిల్
- రెండు సబ్జెక్ట్‌లపై ప్రత్యేక దృష్టి
- కనీస ఉత్తీర్ణత సాధించేలా జిల్లా విద్యాశాఖ ప్రణాళిక




సాక్షి, మహబూబాబాద్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో మెరుగైన స్థానంలో నిలిపేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు గతంలో ఎక్కువమంది విద్యార్థులు ఏ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు.. అందుకు గల కారణాలను తెలుసుకుంటున్నారు. పొరపాట్లను సరిదిద్దుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు. కాగా గత మూడేళ్లుగా ఎక్కువ మంది విద్యార్థులు గణితంలో ఉత్తీర్ణత సాధించలేదు. అలాగే సైన్స్‌లో ఆశించస్థాయిలో ఫలితాలు సాధించలేదు. దీంతో ఆ రెండు సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

మ్యాథ్స్, సైన్స్‌లోనే ఎక్కువ

ఏటా పదో తరగతి వార్షిక పరీక్షల్లో మ్యాథ్స్, సైన్స్‌లో ఫెయిల్ అయిన వారు ఎక్కువగా ఉంటున్నారు. మూడు సంవత్సరాలుగా రెండు సబ్జెక్టుల్లోనే ఎక్కువగా ఫెయిల్ అవుతున్నారు. 2022లో గణితంలో 362 మంది, సైన్స్‌లో 449 మంది, 2023లో గణితంలో 784మంది, సైన్స్‌లో 637 మంది, 2024లో గణితంలో 166 మంది, సైన్స్‌లో 239 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇలా జిల్లాలో ఎక్కువగా ఈ రెండు సబ్జెక్టుల్లోనే ఫెయిల్ అవుతుండడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు రాబట్టాలని భావిస్తున్నారు.

మూడేళ్లుగా జిల్లా ఉత్తీర్ణత శాతం



జిల్లాలో మూడేళ్లుగా వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య

సబ్జెక్టు	2022	2023	2024
తెలుగు	345	154	106
హిందీ	106	16	22
సోషల్	99	86	52
ఇంగ్లిష్	259	90	97
గణితం	362	784	166
సైన్స్	449	637	239

టెన్షన్.. టెన్షన్

జిల్లాలో ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలలు 757, కేజీబీవీలు 15, మోడల్ స్కూల్స్ 8, మొత్తంగా 780 బడులు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 45,752 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 209 ఉన్నత పాఠశాలల్లో 8,181 మంది పదో తరగతి పరీక్ష రాసేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారితో కలెక్టర్ పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. తప్పులు సరిదిద్దుకొని మంచి ఫలితాలు సాధించేలా ప్రణాళికతో వెళ్లాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు ఏటా ఎక్కువగా ఫెయిల్ అవుతున్న సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని, ఇందుకోసం ప్రత్యేక కరదీపికలను వినియోగించుకోవాలని ఆదేశించారు.

వెనకబడిన విద్యార్థులపై దృష్టి



చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి సులభంగా అర్థమయ్యే అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ బోధన చేస్తున్నాం. సైన్స్‌లో ప్రాథమిక స్థాయిలో వెనకబడడంతోనే ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారు. సాధ్యమైనంత మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి బేసిక్స్ నేర్పించి తర్వాత పాఠ్యాంశంలోకి తీసుకొచ్చి బోధన చేస్తున్నాం. ఈ ఏడాది మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

- అబ్దుల్ రహమాన్, హెచ్‌ఎం, చిన్నగూడూరు

అభ్యసన దీపికలతో ప్రాక్టీస్..



విద్యార్థులకు సహజంగానే గణితం అంటే భయం ఉంటుంది. దీనికి తోడు కరోనాతో రెండు సంవత్సరాలు ఇబ్బంది పడ్డారు. గణితంలోని చతుర్విద ప్రక్రియలు కూడా చేయలేని స్థాయిలో కొందరు విద్యార్థులు ఉన్నారు. అలాంటి వారిని ఈ ఏడాది ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికతో చదివిస్తున్నాం. అభ్యసన దీపికలను ప్రాక్టీస్ చేయిస్తూ..చదువులో వెనకబడిన విద్యార్థులను కనీస ఉత్తీర్ణత స్థాయికి తీసుకువచ్చేలా చదివిస్తున్నాం.

- కాలేరు యాదగిరి, ఎంఈఓ, కేసముద్రం

ప్రత్యేక ప్రణాళికతో బోధన



పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. గత మూడు సంవత్సరాల ఫలితాలను పరిశీలిస్తే గణితం, సైన్స్‌లో ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారు. ఇతర సబ్జెక్టులు బోధిస్తూనే.. పైరెండు సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పాం. అభ్యసన దీపికలు, ఇతర మెటీరియల్ వినియోగించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

- రవీందర్‌రెడ్డి, డీఈఓ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



దంతాలపల్లి: గున్నెపల్లి గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

దంతాలపల్లి: అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని గున్నెపల్లి, ఆగపేట గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన సర్వేను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలం, అంగన్‌వాడీ సెంటర్, గ్రామపంచాయతీ కార్యాలయాలను పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని పీహెచ్‌సీని పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్యం, ఆస్పత్రిలోని వసతులపై ఆరా తీశారు. బుధవారం ఆస్పత్రిలో జరిగిన ఘటనపై విచారణ చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, వైద్యురాలు చైతన్య, ఏఓ వాహిని, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్‌ఐ నజిముద్దీన్, ఎంపీఓ అప్సర్‌పాషా, ఏఈఓలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా చేపట్టాలి

నర్సింహులపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేను క్షేత్రస్థాయిలో సక్రమంగా చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. గురువారం మండలంలోని నర్సింహులపేట, ముంగిమడుగు గ్రామాల్లో అధికారులు చేపడుతున్న సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చప్పిడి నాగరాజు, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ కిన్నెర యాకయ్య, ఏఓ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

చిన్నగూడూరు: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందించేలా సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. గురువారం మండలంలోని చిన్నగూడూరు, గుండంరాజుపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ రజని ఉన్నారు.

డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



డయాలసిస్ అదనపు బెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

నెహ్రూసెంటర్: డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంజూరైన అదనపు డయాలసిస్ బెడ్లతో పాటు ఎన్‌సీడీ సెంటర్, ఫ్రీజర్లను ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు గురువారం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదగా వ్యవహరిస్తూ వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదని, రాత్రి వేళల్లో వైద్యులు ఉండడం లేదని తనకు ఫోన్లు వస్తున్నాయని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. సరిగా పని చేయని వైద్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ మురళీధర్, ఆర్‌ఎంఓ జగదీశ్వర్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న నూతన ఉపాధ్యాయులకు టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం అవగాహన సదస్సు కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. అవగాహన సదస్సును నూతన ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి మైస నాగయ్య, జిల్లా బాధ్యులు శ్రీశైలం, శ్రీనివాస్, ఉపేందర్, రాజు, అంజయ్య, సదయ్య, కార్తీక్, మురళి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- జిల్లా రవాణాశాఖ అధికారి జైపాల్‌రెడ్డి



వాహనదారుడికి గూలాబీపువ్వు అందజేస్తున్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: వాహనదారులు, ప్రజలు బాధ్యతాయుతంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని మూడుకొట్ల సెంటర్‌లో జిల్లా రోడ్డు రవాణాశాఖ అధికారులు వాహనదారులకు గూలబీపూలు అందజేసి రోడ్డు భద్రత, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, తల్లిదండ్రులు పిల్లలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ సర్వయ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.సాయిచరణ్, వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్ల బెడద

మిరప పంటను ఆశిస్తున్న వైరస్

- దిగుబడి తగ్గిపోతుందని రైతుల ఆవేదన
- మార్కెట్‌లో ధరల పతనం



వేరుకుళ్లు సోకి ఎండిపోతున్న మిరపతోట

మరిపెడ రూరల్: ఆరుగాలం కష్టపడే రైతులకు ఏటా తెగుళ్ల బాధ తప్పడం లేదు. అన్నదాతలు ఎంతో ఆశతో మిరప సాగు చేయగా.. తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గుతోంది. దీనికి తోడు మార్కెట్‌లో ధర రోజురోజుకూ పడిపోతోంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ఏటా అప్పులే మిగులుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.70నుంచి రూ.80 వేలు పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వచ్చే సమయానికి తెగుళ్లు సోకడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

తెగుళ్ల దాడి..

మిర్చి పంటకు ఆకుముడత, నల్లి, జెమినీ వైరస్, వేరుకుళ్లు వంటి తెగుళ్లు సోకాయి. ఒక్కసారిగా రెండు, మూడు రకాల తెగుళ్లు సోకడంతో చెట్టంతా ముడచుకుపోయింది. నల్లి తెగులు కారణంగా పూత నిలవడంలేదు. మరో పక్క ఆకు ముడుచుకుంటుంది. వేరుకుళ్లతో చెట్లు వాడిపోయి చచ్చిపోతున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా తెగుళ్లు అదుపులోకి రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ధరల పతనం..

ఈ దఫా మంచి విత్తనాలు సాగు చేశామని, ఎకరాకు 30నుంచి 40క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే పలు రకాల తెగుళ్లు సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు దిగుబడి క్షీణిస్తుంటే, మరోవైపు మార్కెట్‌లో ధర క్వింటాకు రూ.15 వేలకు పడిపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

తెగుళ్లతో కోలుకోలేని దెబ్బ



రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాను. రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి అయింది. తోట ఏపుగా పెరిగిందని అనుకునేలోపే నల్లి, ఆకుముడుత, వేరుకుళ్లు తెగుళ్లు సోకాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాలేదు. దిగుబడి తగ్గింది. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు.

-మాలోతు దస్రు, మిరప రైతు, బావోజితండా

ఆశల పల్లకిలో అందరూ.. అర్హులు ఎందరో?

నాలుగు సంక్షేమ పథకాలకు 26న ముహూర్తం

- ఉమ్మడి వరంగల్‌లో మొదలైన అధికారుల కసరత్తు
- 20 వరకు గ్రామాలలో క్షేత్రస్థాయి సర్వే.. 24న ప్రభుత్వానికి తుది నివేదిక
- అదేరోజు కలెక్టర్‌లతో సీఎం సమావేశం?



సర్వే చేస్తున్న సిబ్బంది

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మరో నాలుగు సంక్షేమ పథకాలకు ఈ నెల 26న శ్రీకారం చుడుతోంది. కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీ, గూడులేని పేదల కలలు సాకారం చేసే విధంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతుల ఆశలకు తగ్గట్టుగా రైతు భరోసా, కూలీల ఆత్మీయ భరోసా వంటివి అమలు చేయడానికి రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి గురువారంనుంచి తుది దశ కసరత్తు మొదలైంది. ఈ నెల 20 వరకు క్షేత్రస్థాయిలో పర్యటించనున్న అధికారుల బృందాలు.. 21 నుంచి 24 తేదీవరకు గ్రామసభల్లో వివరాల ప్రదర్శించనున్నారు. 24న తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుండగా.. అదే రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. హైదరాబాద్‌లో ప్రత్యక్షంగా గానీ, లేదంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గాని ఈ సమావేశం ఉంటుందని తెలిసింది.

అర్హులకే అందేలా కసరత్తు..

రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు.. ఈ నాలుగు పథకాలపై ఉమ్మడి వరంగల్‌కు చెందిన ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆచితూచి అర్హులను ఎంపిక చేసేందుకు వడపోత కొనసాగిస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి అర్హులైన రైతులకు ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ.12 వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియ మొదలుకానుంది. వానాకాలం, యాసంగి సీజన్లలో ఆరువేల రూపాయల చొప్పున నగదు అందనుంది. జిల్లాలో వానాకాలం పంటల సాగు 7.15 లక్షల ఎకరాలు సాగుకాగా ప్రస్తుత యాసంగి పంటల సాగు అంచనా ప్రకారం 5.25 లక్షల ఎకరాలుగా ఉంది. 2024 యాసంగిలో 8,77,173 మంది రైతులకు రూ.880 కోట్ల రూపాయల రైతు భరోసా అందింది. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల మేరకు ఎందరికి భరోసా దక్కుతుందో ఈనెల 26వ తేదీన తేలనుంది. ఇందిరమ్మ ఇళ్లు ఉమ్మడి జిల్లాకు 40 వేలు రానున్నాయి. ఇప్పటికే ప్రజాపాలన సభల ద్వారా సుమారు 1.58 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్నారు. వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి సర్వే చివరి దశకు చేరుతుండగా.. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కూడా ఫైనల్‌గా తనిఖీలు చేస్తున్నారు. తొలి దశలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున 12 నియోజకవర్గాలకు 40 ఇళ్లు కేటాయించనున్నారు. అలాగే భూమిలేని నిరుపేదల ప్రతి సంవత్సరం రూ. 12 వేల చొప్పున రెండు విడతలుగా ఇచ్చేందుకు అర్హులపై ఆరా తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 18.45 లక్షల మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నట్లు గుర్తించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో అమలు అయ్యే ఈ పథకానికి భూమిలేని నిరుపేదల కుటుంబాన్ని యూనిట్‌గా ఎంపిక చేసి అమలు చేయనున్నామని ఓ అధికారి చెప్పారు.

ఏ పథకం కోసం.. ఎందరంటే..

జిల్లా	రైతు బంధు (గతంలో లబ్ధిదారులు)	రేషన్‌కార్డుల దరఖాస్తులు	ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు
హనుమకొండ	1,50,982	5650	2,57,968
వరంగల్	1,54,405	4820	2,73,913
భూపాలపల్లి	1,16,574	15,625	2,92,446
ములుగు	76,692	12,158	2,06,211
జనగామ	1,85,937	43,370	2,78,838
మహబూబాబాద్	1,92,583	76,197	5,35,950
మొత్తం	8,77,173	1,57,820	18,45,326

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో ధీమా..



నా భార్య రోజువారీ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంది. నేను టైలరింగ్ పనిచేస్తా. రోజు వారి కూలీ పనులు చేసుకుంటూనే పిల్లలను చదివించుకున్నాం. గత ప్రభుత్వాలు భూమి ఉన్న వారికే రైతుబంధు, రుణమాఫీ లాంటి పథకాలు వర్తింపజేశాయి. మాలాంటి భూమి లేని నిరుపేదలకు ఎలాంటి సహాయమూ చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయడం హర్షణీయం.

- సూరం రమేశ్, పీచర, వేలేరు మండలం

అర్హులకు రేషన్ కార్డులు అందజేయాలి



అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రేషన్ కార్డులు అందించాలి. ప్రభుత్వం అందించే రుణమాఫీ లాంటి పథకాలు అందాలంటే రేషన్ కార్డు ప్రాధాన్యం కావడంతో చాలా మందికి రుణమాఫీ కాలేదు. ప్రస్తుతం దరఖాస్తులు చేసుకునే వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులను జారీ చేయాలి.

- బంక శ్రీనివాస్, వేలేరు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక..



ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. ఇందుకోసం గ్రామసభలు జవాబుదారీతనంగా నిర్వహించేలా అధికారులు, సిబ్బందికి సూచించాం. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆదాయ వివరాలను సేకరించి అర్హులైన రేషన్ కార్డుల జాబితాలు గ్రామసభలో ప్రజలకు నివేదిస్తాం. గ్రామ సభలకు ఒకరోజు ముందే ప్రజలనుంచి వచ్చిన అభ్యంతరాలను సేకరిస్తాం.

- పి.ప్రావీణ్య, కలెక్టర్, హనుమకొండ

సాగులో లేని భూములను గుర్తించాలి

నర్సింహులపేట: రైతు భరోసా పథకం అమలు కోసం చేపట్టిన సర్వేలో సాగులో లేని భూముల వివరాలను గుర్తించాలని డీఏఓ విజయనిర్మల అన్నారు. గురువారం మండలంలోని నర్సింహులపేట శివారు అక్కిరాల, ముంగిమడుగు గ్రామాల్లో అధికారులు చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. రైతులకు అన్యాయం జరగకుండా సర్వే చేయాలన్నారు. మండలంలో సుమారు 700 ఎకరాల సాగులో లేని భూమిని గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓలు, సర్వే బృందం సభ్యులు పాల్గొన్నారు.

కేయూ ఆర్ట్స్ డీన్‌గా మనోహర్

● రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ డీన్‌గా హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్, సోషల్ సైన్స్ డీన్ టి. మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.ఆర్ట్స్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తెలుగు విభాగం ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి ఇటీవల మృతి చెందగా ఆ పదవి ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆ పదవిలో నియమించడానికి తెలుగు, విభాగం, ఇంగ్లిష్ విభాగాల్లో రెగ్యులర్ ప్రొఫెసర్లు లేరు. ఆర్ట్స్ డీన్ పదవిలో ప్రొఫెసర్ మాత్రమే నియమించాల్సింది. దీంతో సోషల్‌సైన్స్ విభాగం డీన్ మనోహర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రాంచంద్రం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా దూర విద్యకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి. రాంచంద్రం నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.ఆ విద్యాకళాశాలలో రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకపోవడంతో సుమారు రెండు సంవత్సరాలుగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ రణధీర్‌రెడ్డిని కొనసాగించారు. ప్రస్తుతం అతడి స్థానంలో రాంచంద్రంను నియమించారు. రాంచంద్రం సీడీసీ డీన్‌గా, సైకాలజీ విభాగం అధిపతిగా కొనసాగుతున్నారు.

ఇదిగో బైక్ దొంగ..

● ద్విచక్రవాహనాన్ని అపహరిస్తూ సీసీ కెమెరాకు చిక్కిన దుండగుడు



ద్విచక్రవాహనాన్ని అపహరించుకెళ్లిన అనుమానితుడు

కాజీపేట: బైక్ దొంగ దొరికాడు. కాజీపేట రైల్వే జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని అపహరిస్తూ సీసీ కెమెరాకు చిక్కాడు. బాధితుడి కథనం ప్రకారం.. గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన గోపి గురువారం దేవాలయ సముదాయం ఆరుబయట తన బైక్‌ను పార్క్ చేసి స్టేషన్‌లోపలికి వెళ్లాడు. పని పూర్తయిన వెంటనే బయటకు వచ్చాడు. ఈలోపు తన వాహనం కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసుకు ఫిర్యాదు చేయగా వారు సీసీ పుటేజీని పరిశీలించారు. ఇందులో బ్లాక్ ప్యాంట్, చెక్స్ షర్ట్ ధరించి గుండుతో ఉన్న ఓ వ్యక్తి ఫోన్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఎవరూ చూడడం లేదనే నిర్ధారణకు వచ్చిన అనంతరం ద్విచక్ర వాహనం లాక్ ఓపెన్ చేసి పరారైనట్లు కనిపించింది. దీంతో సదరు వ్యక్తిని గుర్తించడానికి పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మిల్స్‌కాలనీ ఎస్సై కారు పల్టీ..

● బెలూన్ ఓపెన్‌తో క్షేమంగా బయటపడిన సురేశ్

● భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో ఘటన



పల్టీకొట్టిన కారు

ఖిలా వరంగల్: దైవ దర్శనానికి బయలుదేరిన వరంగల్ మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్ కారు అదుపు తప్పి పల్టీకొట్టింది. బెలూన్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సురేశ్ గురువారం ఉదయం హనుమకొండ నుంచి భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దర్శనానికి తన కారులో ఒంటరిగా బయలుదేరారు. ఈ క్రమంలో కారు కొత్తపల్లి శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించబోయి అదుపు తప్పి పల్టీకొడుతూ పంటపొలంలో పడింది. కారులో బెలూన్ ఓపెన్ కావడంతో ఎస్సై సురేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వెంటనే అతడిని స్థానికులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొంది క్షేమంగా ఇంటికి చేరుకున్నట్లు సమాచారం.

చెస్, జూడోలో దేవా రాణింపు..



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన దేవా ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాడు. దేవా మూడు సంవత్సరాలుగా చదరంగంలో రాణిస్తున్నాడు. ఏడాది క్రితం పూణెలో జరిగిన జాతీయ పారా జూడో పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఏపీలోని ఏలూరులో జరిగిన చెస్ టోర్నీలో ప్రతిభతో అందరినీ ఆకర్షించాడు.

చెస్‌పై నవీన్ పట్టు..



9వ తరగతి చదువుతున్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన నవీన్ కేవలం సంవత్సర కాలంలోనే చెస్‌పై పట్టు సాధించాడు. రోజూ సాయంత్రం స్నేహితులతో కలిసి ప్రాక్టీస్ చేస్తూ ప్రత్యర్థులకు తన ఆటతీరుతో చెమటలు పట్టిస్తున్నాడు.

హ్యాట్సాప్ రహమాన్..



కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన రహమాన్ వరంగల్‌లోని ఏవీవీ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. సుమారు 50కి పైగా సినీ, రాజకీయ ప్రముఖుల గొంతుకలతో మిమిక్రీ చేస్తూ ఆహుతులను ఆకర్షిస్తున్నాడు. టీవీల్లో వచ్చే కార్యక్రమాలను వింటూ ఏకలవ్య శిష్యుడిగా మిమిక్రీలో రాణిస్తున్నాడు. పదేళ్లలో అనేక స్టేజీ షోల్లో ఎందరినో తన మిమిక్రీతో మైమరిపించాడు.

పాటల పూదోటలో తరుణ్..



ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమీపంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన తరుణ్ 2వ తరగతి చదువుతున్నాడు. అతి చిన్న వయస్సులోనే తన స్వరం నుంచి జానపదగేయాలను ఆలపిస్తున్నాడు. పాటల పూదోటలో విరబూసిన గులాబీలా పదేళ్ల వయసులో మధురంగా పాడుతూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

సకల కళా కోవిదులు ..



చెస్ ప్రాక్టీస్ చేస్తున్న అంధ విద్యార్థులు



అంధుల పాఠశాల

లూయిస్ అంధుల పాఠశాల విద్యార్థుల అసమాన ప్రతిభ

● ఆటల్లో ఆణిముత్యాలు

● పాటల పూదోటలో మందారాలు

● మిమిక్రీలో ఉద్ధండులు

వరంగల్ స్పోర్ట్స్ : శరీరంలో అన్నీ భాగాలు బాగున్నా.. సదుపాయాలు లేవనే సాకుతో ఏమాత్రం మెదడుకు పదను పెట్టకుండా.. తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తులను బయటకు తీయకుండా సోమరితనంతో ఒకేచోట పాకులాడే వారు ఎందరో. ఇలాంటి వారిని ఎంత ప్రోత్సహించినా.. ఎన్ని అవకాశాలు కల్పించినా ప్రయోజనం శూన్యం. కారణం నేర్చుకోవాలనే ఆలోచన, ఉత్సాహం వారికి లేకపోవడమే. అలాంటి వారికి వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ అంధుల పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న అంధ విద్యార్థులు స్ఫూర్తి. ఇందులో ఓ విద్యార్థి స్మార్ట్‌ఫోన్‌పై టచ్ చేసిన నంబర్ ఏమిటో ఇట్టే చెప్పేసాడు. అలాగే, మరి కొందరు విద్యార్థులు క్రీడల్లో, ఇంకొందరు విద్యార్థు పాటల్లో, మిమిక్రీలో రాణిస్తూ ఆహుతులను ఔరా అనిపిస్తున్నారు. ఇలాంటి రత్నాలు, ఆణిముత్యాలు ఆ పాఠశాలలో ఇంకా ఉన్నారు. వారికి మరింత ప్రోత్సాహం అందిస్తే ఎన్నో అద్భుతాలు చేసి చూపిస్తారనడంలో అతిశయోక్తి లేదు. ఈ క్రమంలో ఆటలు, పాటలు, మిమిక్రీలో రాణిస్తున్న సకల కళాకోవిదులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

స్మార్ట్ ఫోన్‌పై నంబర్ టచ్ చేస్తే ఇట్టే చెప్పేస్తున్న రాజ్‌కుమార్..



స్మార్ట్ ఫోన్ వచ్చాక పట్టుమని పది ఫోన్ నంబర్లు కూడా గుర్తించుకోలేని పరిస్థితి.. అందుకు భిన్నంగా ఓ విద్యార్థి టచ్ చేసిన నంబర్ ఏంటో ఇట్టే చెప్పేస్తున్నాడు.. ఇందులో వింతేమి ఉంది. చదువుకున్న ప్రతి ఒక్కరూ చెబుతారూ అంటారా.. నిజమే. కానీ ఆ విద్యార్థి పుట్టుకతోనే అంధుడు.. అయితేనేం అతడి ప్రతిభ ముందు అందరూ చిన్నబోవాల్సిందే. అతడే మహబూబాబాద్‌కు చెందిన రాజ్‌కుమార్. వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ అంధుల పాఠశాలలో ఉంటూ బ్రెయిలీ లిపి ద్వారా 9వ తరగతి చదువుతున్నాడు. ఇతను స్మార్ట్ ఫోన్‌లో కీప్యాడ్‌లో డయల్ చేస్తే వచ్చే బీప్ శబ్దాన్ని బట్టి అంకెను చెబుతున్నాడు. అదేంటి స్మార్ట్ ఫోన్‌లో ఏ నంబర్ ప్రెస్ చేసిన ఒకేలా శబ్దం వస్తుంది కదా అనుకుంటున్నారు కదా. కానీ వేర్వేరుగా వస్తుందని రాజ్‌కుమార్ చెబుతున్నాడు. చిన్నపాటి తేడాతో వచ్చే శబ్దాన్ని పసిగట్టి అంకెను చెప్పడమంటే అసాధారణ ప్రతిభ అని ఎవరైనా ఒప్పుకోవాల్సిందే.

అభిరుచులకు అనుగుణంగా శిక్షణ..



నా భర్త కుమారస్వామి పుట్టుకతో అంధుడు. మా పాప కీర్తన బ్లైండ్. కూతురు కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలో ఇప్పుడు 28మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు బాలికలు రోజూ ఇంటికి వెళ్లి వస్తుంటారు. 26 మంది బాలురు ఇక్కడే ఉంటూ చదువుకుంటున్నారు. మా పాప ప్రస్తుతం ఏవీవీ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. కరోనా సమయంలో నా భర్త చనిపోయాడు. అతడి ఆశయమైన ఈ పాఠశాలను పెద్దల సహకారంతో కొనసాగిస్తున్నాం. ఒక్కొక్కరిలో ఒక్కో ప్రతిభ ఉంది. అది గమనించి వారికి ఆ రంగంలో శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నాం.

-నలివెల కల్యాణి, ప్రిన్సిపాల్,
లూయిస్ అంధుల పాఠశాల ఆటోనగర్, వరంగల్

పారా జూడో నేషనల్స్‌లో గౌతమ్‌కు కాంస్యం..



వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన గౌతమ్ లూయిస్ బ్రెయిలీ స్కూల్‌లోనే ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. మూడు సంవత్సరాల నుంచి జూడోలో శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో గతేడాది పంజాబ్‌లో జరిగిన పారా నేషనల్స్ జూడో పోటీల్లో మైనస్ 60కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఇవే కాకుండా మరికొన్ని పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు.

చదరంగంలో స్వరాజ్ దిట్ట..



వరంగల్‌లోని పోచమ్మైదాన్‌కు చెందిన స్వరాజ్ బ్రెయిలీ లిపి ద్వారా 8వ తరగతి చదువుతున్నాడు. రెండు సంవత్సరాలుగా చదరంగంలో శిక్షణ పొందుతున్నాడు. అరుదుగా జరిగే బ్లైండ్ చెస్ టోర్నీలో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. క్రికెట్ సైతం ఆడుతానని చెబుతున్నాడు.

జీపీ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ పోటీ

● సర్పంచ్‌గా గెలిచిన గ్రామాల్లో ఉచిత విద్య, వైద్యం

● ఆ పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్



మాట్లాడుతున్న కె.ఎ.పాల్

హన్మకొండ: తెలంగాణలో త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్ని కల్లో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్ అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాశాంతి పార్టీ అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలిచిన గ్రామాల్లో ఉచిత విద్య, వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఏడాదిలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక కంపెనీ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. ప్రజాశాంతి బీసీ పార్టీ అని, వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. వరంగల్ 30 సంవత్సరాల క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉందన్నారు. మంత్రిగా ఉండి కడియం శ్రీహరి ఏమి అభివృద్ధి చే శారని ప్రశ్నించారు. ఇప్పుడున్న పార్టీ వీడి ప్రజా శాంతి పార్టీలో చేరితే ఉమ్మడి వరంగల్‌ను అభివృద్ధి చేసుకుందామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి వరంగల్‌ను దోచుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. గద్దర్, అంబేద్కర్ ఆలోచనల మేరకు ప్రజాశాంతి పార్టీ నడుచుకుంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీసీ సీఎం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ప్రజాశాంతి పార్టీతో కలిసి రావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దుర్గా ప్రసాద్(ఫైల్)

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని ఉప్పేడు గొల్లగూడెంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్(28) ట్రాక్టర్ నడుపుకుంటూ గ్రామంలోకి వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి డ్రైవింగ్ సీటు నుంచి ట్రాక్టర్ కింద పడ్డాడు. ఎడమకాలు పైనుంచి వెనుక చక్రం వెళ్లడంతో తీవ్ర గాయమైంది. గమనించిన గ్రామస్తులు 108లో చికిత్స నిమిత్తం ఏటూరునాగారం తరలిస్తుండగా మృతి చెందాడు.

కన్న తండ్రిని గెంటేశాడు..

● ఆస్తి మొత్తం రాయించుకుని.. బయటకు పంపిన కుమారుడు

● పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు



ఫిర్యాదును చూపిస్తున్న రాజిరెడ్డి

వర్ధన్నపేట: కని పెంచి ప్రయోజకుడిని చేసిన కన్న తండ్రినుంచి మొత్తం ఆస్తి తన పేర రాయించుకుని ఇంట్లోనుంచి వెళ్లగొట్టాడు ఓ కుమారుడు. ఈ ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట శివారు దొడ్లగడ్డ పల్లెలో గురువారం చోటుచేసుకుంది. ఈ మేరకు గ్రామానికి చెందిన గుజ్జుల రాజిరెడ్డి అనే వృద్ధుడు తన కుమారుడు వినయ్‌రెడ్డిపై గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దొడ్లగడ్డ పల్లెకు చెందిన రాజిరెడ్డి 33 సంవత్సరాల క్రితం మైలారం గ్రామానికి చెందిన సుజాతను వివాహం చేసుకున్నాడు. ఇరువురి దాంపత్య జీవితంలో ఓ కుమార్తె, కుమారుడు వినయ్‌రెడ్డి జన్మించారు. ఐదేళ్ల తర్వాత రాజిరెడ్డి అదే గ్రామానికి చెందిన మరో మహిళ యశోదను ప్రేమించి మొదటి భార్యను ఒప్పించి పెళ్లి చేసుకున్నాడు. అందరూ కలిసి 25 ఏళ్లు ఒకే ఇంట్లో గడిపారు. రెండో వివాహం చేసుకున్న యశోదకు ఓ కుమార్తె జన్మించింది. వినయ్‌రెడ్డి పెరిగి పెద్దయ్యాక తన తండ్రి పట్ల కర్కషత్వాన్ని ప్రదర్శించాడు. రాజిరెడ్డికి తన తాతల కాలం నుంచి వస్తున్న సుమారు 15 ఎకరాల భూమిని కాజేయాలని తల్లి సుజాతతో కలిసి ప్లాన్ చేశాడు. పెద్ద కుమార్తె శ్రావణి పెళ్లి అయ్యాక తండ్రిని వినయ్‌రెడ్డి బెదిరించి భూమి మొత్తం తన పేర రాయాలని, లేని పక్షంలో తన చిన్నమ్మ యశోదను, ఆమె కూతురును చంపేస్తానని బెదిరించాడు. దీంతో అతను భయపడి 2022లో వినయ్‌రెడ్డి పేరుపై భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. వెంటనే రాజిరెడ్డితోపాటు ఆయన తల్లి వనమ్మ, చిన్నమ్మ యశోద, ఆమె కూతురు (చెల్లి)ని ఇంట్లోంచి బయటకు పంపించాడు. అప్పటినుంచి బయటనే ఉంటున్నారు. రెండు నెలల క్రితం రాజిరెడ్డి తల్లి మృతిచెందగా అంత్యక్రియల కోసం ఇంటికి వెళ్తే వినయ్‌రెడ్డి మృతదేహాన్ని వేయనీయలేదు. దీనిపై గ్రామస్తులు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో రాజిరెడ్డి తన తల్లి కర్మ కార్యక్రమాలు బయటే చేశాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాజిరెడ్డి ఎలాగైనా తన కుమారుడికి బుద్ధి చెప్పాలని వర్ధన్నపేట పోలీసులు, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2005 రెవెన్యూ చట్టం ప్రకారం తనను బెదిరించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి పట్టా పాసుబుక్ రద్దు చేసి తన పేరు మీద చేయడంతోపాటు తన కుమారుడు వినయ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు రాజిరెడ్డి తెలిపారు.

డీ అడిక్షన్ సెంటర్‌లో తనిఖీ

● నిర్వాహకుడు, నకిలీ వైద్యుడు రాముపై కేసు నమోదు



డీ అడిక్షన్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న టీజీఎంసీ సభ్యులు

ఎంజీఎం : నగరంలోని హెల్పింగ్ హ్యాండ్స్ డీ అడిక్షన్ సెంటర్‌లో టీజీఎంసీ సభ్యులు శేషుమాధవ్, నరేశ్‌కుమార్ గురువారం తనిఖీ నిర్వహించారు. ఇందులో విస్తుపోయే విషయాలు గుర్తించారు. సంబంధిత అధికారుల కథనం ప్రకారం.. డీ అడిక్షన్ సెంటర్‌కు దాతలు అందజేస్తున్న నిధుల గురించి తెలుసుకున్న నిర్వాహకుడు రాము.. అక్రమంగా వాటిని రాబట్టేలా 'హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ' పేరుతో ఓ ఆర్గనైజేషన్ నెలకొల్పాడు. అదే పేరుతో కొన్ని సంవత్సరాల క్రితం హనుమకొండలోని సర్క్యూట్ హౌస్ దగ్గరలో ఓ అద్దె ఇంట్లో డి అడిక్షన్ సెంటర్ నడుపుతున్నాడు. వైద్య పరంగా ఎలాంటి విద్యార్హత లేకపోవడంతో డీ అడిక్షన్ థెరపీలో శిక్షణ తీసుకున్నాడు. శిక్షణ పూర్తయిన అనంతరం డాక్టర్‌గా పేర్కొంటూ తన డీ అడిక్షన్ సెంటర్‌కు వచ్చే రోగులకు మందులు అధిక మోతాదులో ఇస్తున్నాడు. అడ్మిట్ అయిన వారిని రోజూ కొట్టడం, స్క్రూడ్రైవర్‌తో పొడుస్తున్నారని, సరైన ఆహారం కూడా అందించట్లేదని బాధితులు వాపోయినట్లు తెలిపారు. తనిఖీ సమయంలో డీ అడిక్షన్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని తెలిపిన సదరు నకిలీ వైద్యుడు రాము.. తన ఎన్జీఓ అనుమతి పత్రం, డీ అడిక్షన్ శిక్షణ పత్రాలు, ఇతర అనుమతి పత్రాలు ఇవ్వకపోవడంతో టీజీఎంసీ అధికారులు డీఎంహెచ్ఓ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సదరు నకిలీ వైద్యుడు రాముపై కేసు నమోదు చేసినట్లు టీజీఎంసీ సభ్యులు తెలిపారు. తనిఖీలో టీజీఎంసీ సభ్యులతో పాటు వరంగల్ సైకియాట్రీ సొసైటీ సభ్యులు డాక్టర్ మన్మోహన్ రాజు, డాక్టర్ శ్రీధర్‌రాజు, జగదీశ్‌బాబు, రాకేశ్, ధర్జజ్యోతి, నవ్య, దివిజ, శీతల్ పాల్గొన్నారు.

మల్లన్న అలయంలో మహాసంప్రోక్షణ

● శ్వేత లింగానికి ఘనంగా అభిషేకాలు, అన్నపూజ



పవిత్ర జలంతో మహా సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు

ఐనవోలు: హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి జాతర ఉత్సవాలు ముగిశాయి. గురువారం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య మహాసంప్రోక్షణ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో గర్భాలయాన్ని శుద్ధి చేయగా స్వామివారిని ఒగ్గు పూజారులు మేలుకొలిపారు. మధ్యాహ్నం స్వామి లింగాకారాన్ని అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. మహానివేదన, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర, బ్రహోత్సవాల్లో మకర సంక్రాంతి నాలుగు రోజుల జాతర తొలి ఘట్టం ముగిసింది. నాలుగు రోజుల ఉత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారని ఈఓ అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు.

అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

లక్షలాది మందితో పూజలందుకున్న మల్లికార్జున స్వామి, గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మ, భ్రమరాంభిక అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం కూనూరు ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి అర్చకులు బ్రాహ్మణపెల్లి మధుశర్మ, సదాశివశర్మ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు నందనం భానుప్రసాద్ శర్మ, పాతర్లపాటి నరేశ్ శర్మ, ఆలయ ఉద్యోగ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి నాగవెల్లి, పుష్పయాగం

● నేడు ఆలయంలో త్రిశూల స్నానం



స్వామివారికి నాగవెల్లి, పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారికి నాగవెల్లి, పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపపూజ, హోమాలు, హారతి, మంత్రపుష్పం, బలిహరణ, సాయంత్రం ప్రదోషకాల పూజలు, నీలలోహిత పూజ, ఏకాంత సేవ, అష్ట దిక్పాలక ప్రయాణం, సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకుడు నందనం వినయ్‌శర్మ తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా వసంత మండపంలో నీలలోహిత పూజ నిర్వహించి నల్లపూసలను భద్రకాళి అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం పుష్పోత్సవం నిర్వహించి సప్త వర్ణాల ఏకాంత సేవ నిర్వహించారు. నేడు(శుక్రవారం)స్వామివారి ఆలయంలో త్రిశూల స్నానం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ధర్మకర్తలు, ముఖ్య అర్చకుడు రాంబాబు, అర్చకులు వీరభద్రయ్య, శ్రీకాంత్, శివకుమార్, శరత్‌చంద్ర, శ్రావణ్, గురుప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పండుగకు వచ్చి వెళ్తూ మృత్యుఒడికి..

● రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు దుర్మరణం ● భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలో ఘటన

● కేసముద్రంలో విషాదం



అనూష(ఫైల్)



చైత్ర(ఫైల్)

కేసముద్రం: సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వచ్చి కుటుంబీకులు, బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు. అనంతరం హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు దుర్మరణం చెందారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కేసముద్రం మండలం గాంధీపురంజీపీ శివారు వెంకట్రాంతండాకు చెందిన భుక్యా సంతోశ్, అనూష(30) దంపతులు తమ ఇద్దరు కూతుళ్లు ప్రణస్విని, చైత్ర (6)తో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సంతోశ్ ఓ కంపెనీలో జాబ్ చేస్తూ, ఇటీవల కారు కొనుగోలు చేసి ట్యాక్సీ నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు సంతోశ్ తన భార్యాపిల్లలతో కలిసి మూడురోజుల క్రితం స్వగ్రామం వెంకట్రాంతండాకు వచ్చాడు. ఇదే మండలం తెల్ల బండాతండాకు చెందిన తన బావ, చెల్లి హైదరాబాద్‌లోనే ఉంటుండడంతో వారిని తీసుకెళ్లేందుకు సంతోశ్ భార్యాపిల్లలతో కలిసి కారులో బుధవారం తెల్లబండాతండాకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున సంతోశ్ తన కారులో, తన భార్య, ఇద్దరు పిల్లలు, బావ రవి, చెల్లెలు భవాని, కోడలు మోక్షతో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో రాయగిరి సమీపంలో కారు.. లారీని వెనుక నుంచి ఢీకొంది. దీంతో ముందు సీట్లో కూర్చున్న అనూష, తన ఒడిలో కూర్చున్న చిన్న కూతురు చైత్ర అక్కడికక్కడే దుర్మరణం చెందారు. డ్రైవింగ్ చేస్తున్న సంతోశ్‌తోపాటు, తన పెద్దకూతురు, బావ, చెల్లికి తీవ్ర, కోడలికి స్వల్ప గాయాలయ్యాయి. తల్లికూతురు మృతితో వెంకట్రాంతండాతోపాటు అనూష పుట్టినిల్లు కేసముద్రంస్టేషన్ శివారు లచ్చిరాంతండాలో విషాదం చోటుచేసుకుంది.

ఆ పదవులు ఎవరెవరికో



● తెలుగు విభాగంలో రెండు పోస్టులు ఖాళీ

● కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఎవరిని వరించెనో!

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఒకప్పుడు వివిధ పదవుల్లో రెగ్యులర్ ప్రొఫెసర్లకే అవకాశాలు దక్కేవి. సీనియర్ ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందుతుండడం.. అలాగే పలు విభాగాల్లో ఒక్కరు కూడా రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను వివిధ పదవుల్లో నియమించక తప్పడం లేదు. పలు విభాగాల్లో ఇప్పటికే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు వివిధ పదవులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కేయూ తెలుగు విభాగంలో ఉన్న ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం విధితమే. జ్యోతి తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా, ఆర్ట్స్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో ఆమె మృతితో ఆ మూడు పదవులు ఖాళీ అయ్యాయి. తెలుగు విభాగంలో విభాగం అధిపతి, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్ పదవుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లలో ఇద్దరికి అవకాశం దక్కనుంది. తెలుగు విభాగంలో ప్రస్తుతం నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. సీనియారిటీ ప్రాతిపదికన చూస్తే అందులో వరుసగా మామిడి లింగయ్య, మంథిని శంకర్, చిర్రరాజు, కర్రెసదాశివ్ ఉన్నారు. సీనియరిటీప్రాతిపదికన చూస్తే మామిడి లింగయ్యకు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా మంథిని శంకర్‌కు అవకాశం కల్పించాల్సింటుంది. వివిధ కారణాలు చూపి మామిడి లింగయ్యను విభాగం అధిపతిగా నియమించకపోవచ్చుననే అంశం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా ఉంది. అయితే మామిడి లింగయ్య తనకు అవకాశం ఇవ్వాలని అడిగే అవకాశం ఉంది. మరోవైపు సీనియారిటీలో మూడో స్థానంలో ఉన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్రరాజు కూడా తనను తెలుగు విభాగం అధిపతిగా నియమించాలని పావులు కదుపుతున్నారని సమాచారం. ఆయన కేయూ పాలకమండలి సభ్యుడు కూడా. బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా గతంలో మంథిని శంకర్ కూడా కొంతకాలంపాటు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు విభాగం అధిపతిగా లేదా బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా ఏదో ఒక పదవి దక్కే అవకాశాలున్నాయి. ఆర్ట్స్ కాలేజీలో తెలుగు విభాగం ఇన్‌చార్జ్‌గా ఉన్న కర్రెసదాశివ్ అవకాశం కల్పిస్తే తాను కూడా తీసుకునే అవకాశం ఉంది. ఆ నలుగురిలో ఒకరికి విభాగం అధిపతిగా, మరొకరిని బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా ఎవరిని నియమిస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. తనకే దక్కాలని పోటీపడితే మాత్రం నియామకాలు వివాదాస్పదంగా మారే అవకాశం ఉంది. ఒకటిరెండురోజుల్లోనే ఆ రెండు పదవుల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించకతప్పదు. ఆర్ట్స్‌డీన్‌గా మాత్రం కేయూ సోషల్‌సైన్స్‌డీన్ ప్రొఫెసర్ టి. మనోహర్‌ను రిజిస్ట్రార్ మల్లారెడ్డి గురువారం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.